# 'మీరాకే ప్రభూ!'

కమల ఒక్కసారి తన చుట్టుప్రక్కల వున్నవాళ్ళందరినీ కలియజూసింది. తను తప్ప అంతా ఏదో అనిర్వచనీయమైన ఆనందంతో తన్మయులై తమ తమ స్వర్గాలలో విహరిస్తున్నారు. భర్త ప్రక్కనే కూర్చుని వున్నాడు. ఆయన మనస్సుకూడా ఎక్కడో అనంతంలో, దేన్నో వెదుకుతోంది. వీళ్ళందరికి లభ్యమైన యీ అమృత భాండం, తన దగ్గరకి రాగానే హాలాహలమయిపోయింది. ఎందుకంటే తను చేసిన పనికి యిది ప్రాయశ్చిత్తమా?

పాట ఎప్పుడు పూర్తి అయిందో తెలియదు. హాలంతా నిశ్శబ్దం ఆరించింది. యీ నిశ్శబ్దానికి పరిమితి ఒక్క క్షణం మాత్రమే. శ్రోతలంతా తెప్పరిలి యీ జగత్తులోకి రాగానే, వారి చైతన్యంతోపాటు శబ్దంకూడా అక్కడ ప్రవేశించింది. 'పాట ఎట్లావుంది?' అని ఎవ్వరో ప్రశ్నించారు. ఎవరిని? ఈ ప్రశ్నకి సమాధానం ఆలోచించే లోపలే, ప్రశ్న మళ్ళీ వినిపించింది.

చాలా ప్రయత్నంమీద 'బాగానే వుంది' అని సమాధానం యిచ్చింది- ఆమె ముఖంలోకి చూస్తూ. ఆవిడ భర్త నళిని 'అల్లా వున్నావేం' అని అడిగాడు. ఈ ప్రశ్నకి సమాధానం యివ్వగలిగిన మాటలు ఏభాషలోనూ లేవు. ఏదో చెబుదామని అనుకుంది- కాని ఏదో బరువుగా కంఠంలో అడ్డుపడింది.

ఇంతలో నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ-

'మేరితేరి ప్రీతీ తేరి నందలాలకే
లేజా మేరీ ఖబర్-'

అని పాట ప్రారంభమయింది. కన్నీళ్ళతో పోట్లాడుతూ కమల గాయకుడి వంక చూసింది. ఆ అంధుడి ముఖాన్ని నల్లటి మబ్బులు కప్పివేస్తున్నాయి. ఈ విషాదంలోంచి తొంగిచూడటానికి అనేక పూర్వస్మృతులు ప్రయత్నం చేస్తున్నాయి. హృదయంలోని బాధ పాటలో, ముఖకవళికలలో వ్యక్తం అవుతోంది.

ఒకనాడు ఈ పాట విని ఆనందంతో తనను తాను మరచిపోయేది. ఈనాడు... ఈనాడు తనకేం లోపంలేదని అంతా అనుకుంటున్నారు. ప్రాణమిచ్చే భర్త, సిరి, సంపదలు, అన్నీ తనకున్నాయి– తనను చూసి తన స్నేహితులంతా అసూయపడుతున్నారు... కాని తన మనస్సుకు శాంతి ఏది?

తన భర్త నిజంగా ఎంత మంచివాడు! ఏ మంచివస్తువు కనబడినా, దాన్ని తనకు కానుకగా యిస్తాడే. ఎన్ని నగలు... చీరెలు కొనిపెట్టాడో లెక్కలేదుకదా! సంక్రాంతి పండుగనాడు తను పువ్వులు దండ గుచ్చుతూ కూర్చుంది. భర్త 'కమలా' అని పిలిచాడు. ఆ పిలుపులో ఎంతో మార్దవం, ఎంతో లాలనా వున్నాయి. తను వెనక్కి తిరిగి చూసింది. భర్త చేతిలో ఏదో చిన్నపొట్లం వుంది. క్రొత్తబట్టలు కట్టుకున్న నళిని ఎంత అందంగా వున్నాడు?

"నా చేతిలో ఏముందో, చెప్పు చూద్దాం" అని అన్నాడు.

"గీతలు" అని సమాధానం వచ్చింది.

నళిని ముఖం ఆనందంతో వెల్లివిరిసింది. ఏం మాట్లాడకుండా కూర్చుని, కమల మాట్లాడే లోపలే ఆమె పెదిమలని తన పెదిమలతో కలిపివేశాడు– సిగ్గుతో, సంతోషంతో కమల ముఖం కెంపువన్నె కొచ్చింది. "ఎప్పుడూ కొంటె పనులు! ఎవరైనా చూస్తే?" అని అంది.

"తెలివితక్కువవాడైతే తేరిపార చూస్తాడు. బుద్ధిమంతుడైతే తనపనిమీద వెడతాడు."

"మీరూ మీ పనిమీదనే వెళ్ళండి."

"నేను నా పనిమీదనే వచ్చాను."

"ఏమిటి మీ పని?"

"చెబుతాగా కళ్లుమూసుకో. నేను చెప్పిందాకా తెరవవద్దు' అన్నాడు.

కళ్లుతెరిచి చూసేసరికి తన కాళ్ళదగ్గిర ఒక ఉలిపిరికాగితం పొట్లం వుంది. ముందో చూద్దామనే వుబలాటంతో తొందరగా పొట్లం విప్పి చూస్తే ఒక చక్కటి ద్వాల వుంగరం వుంది. దాన్ని చూడగానే కమల ముఖంలోని సంతోషమంతా యింది. కన్నీటితో కళ్ళుమసకలు కమ్మాయి. కనురెప్పలు దాటి చెక్కులమీదుగా జారిన కన్నీటితో పమిట తడిసిపోయింది. 'నన్ను క్షమించు రామం' అని మనస్సు మ్యుగొంతుకలతో ప్రార్థించింది.

అక్కడ నుంచి లేచి తన గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది. పెట్టెలో బ్టల అడుగున యింతకాలం నుంచి దాక్కుని, తన వునికినే మరచిపోయిన ఉంగరం మళ్ళీ బయటకు వచ్చింది. వుంగరం చాలా పాతది. కొత్త మెరుగులని ది ఏనాడో మరిచిపోయింది. కాని ఆ వుంగరానికి సంబంధించిన స్మృతులు మాత్రం యీనాటికి కూడా వన్నె తగ్గలేదు.

తన స్నేహితులందరికీ ఆ వుంగరాన్ని గర్వంతో చూపించిన రోజులున్నాయి. రోజు– పారెయ్యటానికి మనస్సొప్పక, చేతికి పెట్టుకునేందుకు ధైర్యం చాలక,

రహస్యంగా దాచవలసిన గతిపట్టింది. ఏమిటి జీవితం...? అబద్ధాలతో, అనుక్షణం పాపం మూటకడుతూ- మనల్ని మనమే మోసం చేసుకునే బ్రతుకువల్ల చివరకి మిగిలేదేమిటి? ఈ జీవితానికి చివరఅంటూ ఒకటి ఏనాడొస్తుందో!

తన భర్త తనతో ఏ విషయం దాచలేదు- తను మాత్రం? ... తన మనస్సులోని విషయాలన్నీ చెబుదామని అనేకసార్లు అనుకుంది. కాని ధైర్యం చాలక మనస్సులోనిమాట మనస్సులోనే వుండిపోయేది. తను దిగులుగా కూర్చున్నప్పుడు భర్త నవ్వుతూ, 'పుట్టిల్లు గుర్తువచ్చిందా, అయితే లే, బట్టలు సర్దు యింటికి వెడదాం' అని అనేవాడు. ఆయనతో అన్ని విషయాలు చెప్పి తన మనస్సులోని కొండంత భారాన్ని తొలగించుకుందాం అని అనుకునేది. కాని ప్రసన్నంగావున్న ఆయన ముఖంవంక చూడగానే, యీ విషయాలన్నీ చెప్పి వారి మనస్సుని ఎందుకు బాధపెట్టడం, నా కష్టాలు నాలోనే వుండి నాతోనే అంతమయిపోవాలి, అని వెనక్కు తగ్గేది.

చెబుదామని ధైర్యం చేసినా ఎల్లా చెప్పడం? ఏమని చెప్పడం... మొట్ట మొదటిసారి రామాన్ని తను సరళావాళ్ళ యింట్లో కలుసుకుంది. ఆరోజున రామంతో మాట్లాడటానికి తనకి ఎంత సిగ్గు వేసింది... 'అల్లా సిగ్గుపడతావేం, నేనేం పరాయివాడినా' అని రామం అడిగినప్పుడు, అతడు తనకి పరాయివాడుగానే కనిపించాడు. ఆరు సంవత్సరాల తరువాత రామాన్ని చూస్తే, సంతోషంతో బాటు తనకి తెలియకుండానే సిగ్గుకూడా వేసేది. కాని చాలా కొద్ది రోజుల్లోనే అ పరాయివాడు తనకు అత్యంత ఆత్మీయుడయ్యాడు. అతను దగ్గర లేనంతసేపు ఎప్పుడు వస్తాడా, ఎప్పుడు మాట్లాడటమా అని తపించే హృదయం అతను దగ్గరకు రాగానే, సిగ్గుతో మూగపోయేది. రామం తమ యింటికి వచ్చినప్పుడు తన తల్లితండ్రులు అతన్ని ఎంతో ఆదరంతో చూసేవాళ్ళు. 'అమ్మాయీ రామానికి కాఫీ తీసుకురా' అని నాన్న చెప్పేవారు. చక్కటి కాఫీ తయారుచెయ్యాలనే కోరిక కాఫీ ఎల్లా వుందంటాడో అనే భయం. వీటన్నింటితో సతమతమై కాఫీ తయారుచేసి రామానికి యిచ్చింది. పంచదార చాలా ఎక్కువైనట్టు తనకే అనుమానం వేసింది కాని రామం కాఫీని చాలా మెచ్చుకొన్నాడు. నాన్న బజారుకు వెళ్ళినంటూ లేచి వెళ్ళగానే, రామం నవ్వుతూ "నీ చేత్తో ఏది ముట్టుకున్నా చాలా తియ్యబడుతుంది" ' అని అన్నాడు. తను ఏం మాట్లాడలేదు. సంతోషంతో అతని వంకచూసి తలవంచుకుంది.

* * *

రోజులు అలవికాని వేగంతో పరుగెత్తుకుపోయాయి. ఒక రోజున తోటలో కూర్చుని వుండగా రామం తనని దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు. ఒక్కసా

తన శరీరంలోని రక్తమంతా వెర్రిపరుగులు తీసింది. కాని వెంటనే విపరీతమైన భయంకూడా వేసింది- కొద్ది క్షణాలదాకా తనేం మాట్లాడలేకపోయింది.

"కోపమా?" అని మెల్లగా అడిగాడు. లేదన్నట్లు తను తలవూపింది.

మరునాడు రామం తనని కలుసుకోడానికి రాలేదు. సాయంకాలం అంతా కలవరంతో గడిచి, రాత్రిలో కలిసిపోయింది. రామం మనస్సు తను నొప్పించిందా? తను చేసిన తప్పు ఏమిటి? అని చాలాసేపు బాధపడింది. రామం వూరికి వెళ్ళాడని మరునాడు ఉదయం తెలిసింది. "చెప్పకుండా వెళ్ళినందుకు క్షమించమని" రెండు రోజుల తరువాత రామం దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.

రామం తనకి వుత్తరం రాశాడు... ఆనాడు తనకి ఎంత సంతోషం కలిగింది? తన చిన్నారి జీవితంలోకి తొంగిచూసిన మొదటి ప్రేమలేఖ. 'కమలా! వెళ్లేముందర నిన్ను కలుసుకోలేకపోయినందుకు నేనెంత విచారిస్తున్నానో చెప్పలేను. కొందరు వ్యక్తులతో మన జీవితమంతా గడుపుతాం కాని వాళ్ళు మనజీవితంలో ఎటువంటి మార్పుని తీసుకురాలేక పోతారు. కాని కొందరు వ్యక్తులు ఎక్కడినుంచో అకస్మాత్తుగా వచ్చి జీవితంలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించి మన జీవితపంథాలనే మార్చివేస్తారు. కమలా, నా జీవితానికి నీవే యీనాడు ముఖ్య మార్గదర్శివని బహుశః నీకు తెలియకపోవచ్చు. సాధ్యమైనంత త్వరలో వచ్చి నీ దర్శనం చేసుకుంటాను.

– నీ రామం'

ఈ ఉత్తరాన్ని తను ఎన్నిసార్లు చదువుకుందో లెక్కలేదు. త్వరలోనే వస్తానన్న రామం రెండుమాసాల అనంతరం వచ్చాడు. ఆ రెండుమాసాలు ఎంత గడ్డుగా గడిచాయి! ఏ రోజుకారోజు రామం వస్తాడని ఎదురుచూడటం, - తెన్నులు చూసి కన్నులు కాయలు కాయడం. రామం రాలేదు. యింకా రాలేదే అనే ప్రశ్న. చివరికి ఇహ రామం రాడు కాబోలనే నిరాశ దాకా వచ్చింది. ఒకరోజున పరధ్యానంగా కూర్చుని ఆలోచిస్తూ వుంటే రెండుచేతులు తన కళ్లుమూసి వేశాయి. తను వులిక్కిపడ్డది. కాని మరుక్షణంలోనే మనస్సంతా సంతోషంతో తొణికిస లాడింది. ఈ పని చెయ్యడానికి తగిన ధైర్యం, చనువూ ఒక వ్యక్తికే వున్నాయి. విడిపించుకోడానికి ప్రయత్నం చెయ్యకుండా 'నాకు తెలుసు' అని అంది. ఆ గది అంతా రామం నవ్వుతో నిండిపోయింది. నవ్వుతూ ఎదురుగా వున్న అతన్ని చూడగానే అతని వియోగంతో తన మనస్సున పడిన బాధంతా ఒక్కసారిగా కన్నీరై తన చైతన్యాన్నే స్తంభింపజేసింది.

'రామం' అని మాత్రం అనగలిగింది. రెండుచేతులతో తన ముఖాన్ని పైకెత్తి "ఛా! ఎందుకేడుస్తావు?" ఆ మాటతో అసలే కట్టలు తెంచుకోడానికి వుబలాట పడుతున్న కన్నీరు వరదలై ప్రవహించింది.

ఎంత త్వరగా వచ్చిందో దుఃఖం అంతత్వరగా మాయమైంది. "యిన్ని రోజులకా రావటం" అని అడిగింది. "ఏం చెయ్యను? ఏరోజు కారోజు బయలుదేరి వద్దామనుకోవటం, అనుకున్న పని కాక ఆగిపోవడం."

"పోనీ యిప్పటికైనా గుర్తుకు వచ్చాం."

"అబ్బో! కోపం వచ్చినట్లుందే..... కోపంవస్తే నీ ముఖం ఎంత అందంగా వుంది."

"అన్నీ అబద్ధాలు" అంటూ నవ్వింది.

"నవ్వితే యింకా బాగున్నావు."

"అయితే నేను నవ్వను" అని నవ్వకుండా వుండటానికి ప్రయత్నం చేస్తూ కూర్చుంది.

ఈసారి నవ్వడం రామం వంతు....

"ఒక్కసారి కళ్ళు మూసుకో."

"ఎందుకనో?"

"చూస్తే నీకే తెలుస్తుంది."

"కళ్ళు మూసుకుని ఎల్లా చూడటం?"

"ముందు కళ్ళుమూసుకో-"

కళ్ళు మూసుకుని దొంగచాటుగా అతను చేస్తున్నపని చూసింది.

ఒంటిరాయి రవ్వలవుంగరాన్ని తనవేలికి తొడుగుతున్నాడు... తన వేలి ఆది అతనికి ఎల్లా తెలుసు?

అతను ఏం సమాధానం చెప్పేవాడో- ఇంతలోనే నాన్నగారు గదిలోకి వస్తూ-

"ఏం రామం, దబ్బునే వచ్చావే?" అని ప్రశ్నించారు.

"అనుకోని ఆలస్యం అయిందండి" అని సమాధానం యిస్తూ రామం కూడా ఆయన వెంట బయట గదిలోకి వెళ్ళిపోయాడు. తనకేం చెయ్యాలో తోచటంలేదు. ఏనుగెక్కినంత సంబరం వేసింది. కారణం తనకు కొంచెం తెలుసు, కొంచెం తెలియదు.

అమ్మ దగ్గరకువెళ్ళి నుంచుంది. ఆవిడకి వుంగరం చూపించాలని మనస్సు వువ్విళ్ళూరుతోంది- కాని.... ఏమని చెప్పాలి?

"ఏమే, యింకా అల్లాగే వున్నావేం, నీళ్ళూ నిప్పులు ఏం అక్కర్లేదా!" అని అని అమ్మ అంది.

"అది కాదమ్మా, మరే.....తను,....యీ వుంగరం బాగుందా?"

"ఏ వుంగరం? ... ఎవరిదది?"

ఎవరిది అంటే ఏం చెప్పడం.... అతి ప్రయత్నం మీద 'రామం యిచ్చాడు...' అని మాత్రం అనగలిగింది.

"రామం... రామం ఎప్పుడొచ్చాడు?" అని అడుగుతూ తన చేతిని పుచ్చుకుని ఉంగరంవంక చూచింది... ఆవిడ మనస్సులో విషయం తనకి తెలియదు. ఆవిడ మాత్రం తనని దగ్గరగా తీసుకుని తలనిమిరి 'మా తల్లి అదృష్టవంతురాలు' అని అంది.

ఆరోజు సాయంత్రం తను, సరళ, రామం కలసి షికారుకు వెళ్ళారు. ఊరు చుట్టురావుండే పచ్చికబయళ్ళు పొలాలు యివన్నీ పూర్వం కంటే ఆనాడు చాలా అందంగా కనిపించాయి..... దీనికి కారణం రామం తన దగ్గర వుండటమేనా? లేకపోతే అతను యిచ్చిన వుంగరమా? ఒకచోట పెద్ద మట్టిదిబ్బ వచ్చింది. దాన్ని చూడగానే సరళ-

"ఇక్కడ కూర్చుందామా" అని అడిగింది- రామం సమాధానం చెప్పకుండా తనవంక చూచాడు.

"ఏం వదినా, యిక్కడ కూర్చుందామా, యింకా పైకి వెడదామా?" అని సరళ తనను అడిగింది.

"మీ యిష్టం" అని తను అంది.

"అంటే కూర్చుందాం అన్నమాట"- అని రామం అన్నాడు.

ముగ్గురు అక్కడే కూర్చున్నారు. రామంతో మాట్లాడాలి. సిగ్గుపడకూడదు అని అనుకుంటూనే సిగ్గుపడుతూ కూర్చుంది. దూరంగా ఎగిరే కొంగల వంక చూస్తూ సరళ ఎందుకనో నిట్టూర్పు విడిచింది.

తను ఏదో చెబుదామని అనుకుంటూ వుండగానే రామం మెల్లిగా పాడడం మొదలుపెట్టాడు. రామం పాట పాడుతాడు అని తను విన్నది కాని అతను తన దగ్గర ఏనాడూ పాడలేదు. తను పాడమని కూడా అతన్ని ఏనాడు అడగనూలేదు.

జో! ఘనీభూత పీడా ధీ
మస్తక మే స్మృతి సీ ఛాయీ
దుర్దిన్ మే అంసూబనకర్
అజ బరసనే యీ....

ఆ పాటలోని భావం అప్పుడు తనకి తెలియలేదు. కాని ఎందువల్లనో కారణం లేకుండానే మనస్సు గద్గదమైంది. అస్తమించే సూర్యుడు నల్లటి మేఘం లోంచి కడసారిగా చూస్తున్నాడు. తను చూస్తూవుండగానే సూర్యుడు మాయ మయ్యాడు. వెలుతురును తరిమివేస్తూ చీకటి మెల్లిమెల్లిగా ప్రవేశిస్తోంది. మెల్లిగా రామంవంక చూసింది. అతను కూడా ఏదో అనంతంలోకి చూస్తున్నాడు.

'రామం' అని పిలిచింది. అతన్ని పేరుపెట్టి పిలిచే సాహసం తనకి ఎక్కడ నుంచి వచ్చిందో? వులికిపడి తన వంక చూచాడు.

"ఏం?" అని అన్నాడు.

"ఇంకోపాట ఏదైనా పాడండి" అని అంది.

కొద్ది క్షణాలవరకు తన వంక మాట్లాడకుండా చూశాడు.

మేరి తేరి ప్రీతీ తేరి నందలాలరే
లేజా మేరీ ఖబర్

అని పాడటం మొదలుపెట్టాడు. ఈ పాట పాడుతూ వుంటే తనకి ఏదో అజ్ఞాతమైన ఆనందం కలిగింది. ఇదమిత్థమని చెప్పలేదు కాని మనస్సులో మహదానందం కలిగింది. అతను యేదో తన్మయంలో వుండి పాడుతున్నాడు. కృష్ణుని దర్శనంకోసం తపించే మీరా, ఆవిడని కాపాడటానికి వచ్చిన యశోదా తనయుడు తన కళ్లకి కట్టినట్టనిపించింది.

"మీరా కే ప్రభూ గిరిధర్ నాగర్"

మనస్సు వెయ్యి గొంతుకలతో "రామం రామం" అని పిలచింది.

పాట పూర్తయ్యేసరికి చీకటి గుయ్యారంలో చుక్కలు మిణుకు మిణుకు మంటున్నాయి.

ఇంటికి వచ్చేసరికి అమ్మ ఎవరితోనో అంటోంది, "మూఢం వెళ్లగానే మా తల్లికి పెళ్లిచేస్తాం" అని. 'ఎవరికిచ్చి చేస్తా'రని తను అడుగలేదు. అడగదల్చుకోలేదు.

కాని రామానికి తనకి మధ్యవచ్చిన మూఢం శాశ్వతంగా నిలచిపోయింది.

ఏదో ప్రమాదంలో చిక్కుకుని రామం గుడ్డివాడయ్యాడు. తన వంక ప్రేమతో చూచే కళ్లు ఈనాడు గుడ్డివై పోయాయి. ఆసుపత్రిలో అతన్ని చూస్తూ వుంటే తనకి ఎంతో భయం, ఎంతో బాధ కలిగాయి. ఏడ్చి ఏడ్చి తన కళ్లు వాచిపోయాయి. అతని కంటివెంట నీరు కారడం చూస్తే తన హృదయం ఎన్ని వ్రక్కలయింది. ఈ నరకయాతన నుంచి ఎక్కడికైనా దూరంగా పారిపోవాలనిపించింది.

తన స్వార్థానికి తన తల్లి తండ్రులు తోడయ్యారు-

'రామం-

నన్ను మరిచిపో. మీరా ప్రభు గిరిధర్ గోపాలునే ప్రేమించు- నన్ను క్షమించు రామం-

—కమల'

అని వుత్తరం వ్రాసి పంపింది. అది అతను చదువుకోలేడని తనకి తెలుసు. కాని అతనితో ఎదుటపడి యీమాటలు చెప్పగల ధైర్యము తనకి లేదు- ఆ వుత్తరం చదువుకొని సరళ, తనని ఎంత ద్వేషిస్తోందో, రామం ఏమనుకున్నాడో?

భయంతో, దుఃఖంతో పారిపోయిన తనవి నళిని పాదాలవద్ద శరణు దొరికింది- కాని మూడు ముళ్లు పడ్డనాడే తను రామానికి చేసిన అన్యాయం, ద్రోహం గుర్తుకొచ్చి హృదయాన్ని చిత్రవధ చేయటం మొదలుపెట్టాయి.

నళిని అనురాగంలో యీ శోకం గడ్డకట్టి మనస్సులో ఏమూలనో దాకున్నది- ఈనాడు యీ దుర్దినంలో తనని కప్పివేసి కన్నీటితో తడిపివేస్తోంది-

"నన్ను క్షమించు రామం"

..............................

"మీరా కే ప్రభూ గిరిధరనాగర్

"లేజా మేరీ ఖబర్"

ఏదో అలజడైంది. జనం లేచివెళ్లి పోతున్నారు. నళిని తన వంక చూస్తూ చిరునవ్వుతో, ఇంటికి వస్తావా, ఇక్కడే వుంటావా అని అడుగుతున్నాడు.

(ఈ కథలోని శిల్పం కస్తూరి మిత్రాది)